# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

శనివారం 12 ఏప్రిల్ 2025 | www.prajaaswaramdaily.com | 2 pm


## ఎమ్మెల్సీ విజయశాంతి
# దంపతులకు బెదిరింపులు

**తన సొంత సోషల్ మీడియా అకౌంట్ నిర్వాహకుడి దుశ్చర్య**

**ఖాతా నిర్వహణపై సీనియర్ నటి నిలదీతే కారణం**



హైదరాబాద్ : తమను బెదిరించిన వ్యక్తిపై ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయానికొస్తే.. విజయశాంతి సోషల్ మీడియా అకౌంట్ ని చంద్రశేఖర్ రెడ్డి నిర్వహణ బాధ్యతలు చూసేవాడు. సోషల్ మీడియాలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తానని నమ్మబలికాడు .. దీంతో పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పారు దంపతులు. ఆ తర్వాత సోషల్ మీడియా అకౌంట్ ని మెయిన్ టైన్ చేయకుండా వదిలిపెట్టాడు అతడు చేసిన మోసంపై విజయశాంతి దంపతులు చంద్రశేఖర్ రెడ్డిని ప్రశ్నించారు. తనను నిలదీస్తే నరకమేంటో చూపిస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. ఎస్ఎంఎస్, మెయిల్స్ పంపిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# సూట్‌కేసులో గర్ల్‌ఫ్రెండ్

**బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్తూ పట్టుబడిన ప్రేమికుడు**

**పెద్దసూట్ కేసుతో వసతి గృహానికి..**

**అనుమానం వచ్చి నిలదీయగా.. తెరించేందుకు ససేమిరా**

**ఉన్నతాధికారులకు సమాచారం ..ఆపై తెరిస్తే బయటపడిన యువతి**

**అవాక్కయిన సెక్యూరిటీ సిబ్బంది**

**నెట్టింట వీడియో హల్ చల్ రకరకాల కామెంట్లు వైరల్**

చండీగఢ్ : తన ప్రియురాలిని సూట్ కేసులో పెట్టి బాయ్స్ హస్టల్ కు తీసుకెళ్లుండగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ ఉదంతం హర్యానా రాష్ట్రం లో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. హరియాణాలోని సోనిపట్‌లో ఉన్న జిందాల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ విద్యార్థి పెద్ద సూట్‌కేస్‌తో హస్టల్‌లోకి వచ్చాడు. అందులో ఏమున్నాయని సిబ్బంది అడగగా దుస్తులు, వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నాడు. అతడి తీరుపై అనుమానం వచ్చిన హాస్టల్ గార్డులు సూట్‌కేస్ తెరవాలని కోరగా అందుకు నిరాకరించాడు. దీంతోవారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి.. సూట్‌కేస్‌ను తెరవగా అందులో నుంచి ఓ అమ్మాయి బయటకు రావడంతో అవాక్కయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ విద్యార్థి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. అయితే సూట్‌కేసులో ఉన్న అమ్మాయి అదే విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థా, లేక బయటనుంచి వచ్చిన యువతా అనే విషయం ఇంకా తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించారు. వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఓ నెటిజన్ స్పందిస్తూ..“ఈ మధ్య సూట్ కేసులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నట్టున్నాయి” అంటూ చమత్కరించారు.

## బిల్లులపై
# మూడు నెలల్లో నిర్ణయం

**ఈ కాల నిర్దేశాన్ని పాటించని పక్షంలో గవర్నర్ చర్యపై న్యాయసమీక్ష**

**గవర్నర్ల నుంచి రాష్ట్రపతికి బిల్లుల అంశంపై**

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

ఢిల్లీ : గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సు ప్రీం సూచించింది. గడువు నిర్దేశిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈతరహా తీర్పు చెప్పడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.
తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం.
ఒకవేళ మంత్రి మండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని నిలిపి ఉంచాలని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. గవర్నర్ ఈ కాల నిర్దేశాన్ని పాటించని పక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా సూచనల మేరకు తప్పని సరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది.






## యూపీఐ సేవల్లో మరోసారి అంతరాయం

ఢిల్లీ : యూపీఐలో మరోసారి అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఈ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయానికి దాదాపు వెయ్యి మందికి పైగా యూపీఐ సేవల్లో అంతరాయం గురించి ఫిర్యాదు చేశారు. ఎవరికైనా చెల్లింపులు చేస్తుంటే జరగడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది పోస్టులు పెడుతున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్ పనిచేయడం లేదు. ఇవాళ ఒక్క రోజే కాదు.. యూపీఐ సేవల్లో ఇటీవల తరచూ ఈ అవాంతరం ఎదురవుతోంది. దీనికి కారణమేంటన్నది తెలియరాలేదు.

## గౌలిగూడలో
# హనుమాన్ శోభాయాత్ర

హైదరాబాద్: గౌలిగూడలోని శ్రీరామ మందిరం నుంచి హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమైంది. గౌలిగూడ నుంచి కోఠి, నారాయణగూడ బైపాస్ మీదుగా సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ఈ ర్యాలీ సాగనుంది. భక్తులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు. 12 కిలోమీటర్ల యాత్రకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ గౌలిగూడలోని శ్రీరామ మందిరానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి వీర హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమైంది. సైదాబాద్, మాదన్నపేట మీదుగా ఈ యాత్ర కొనసాగుతుంది.

### కొండగట్టు అంజన్న ఆలయంలో ఉత్సవాలు

మాల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకం, సుప్రభాత సేవ నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. దీక్షలు, మాలధారణతో కాలినడకన అంజన్న సన్నిధికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు.



## రామయ్య మృతికి
# ప్రధాని మోదీ సంతాపం

ఢిల్లీ : వనజీవి రామయ్య మృతికి ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. మొక్కలు నాటి వాటిని జీవితాంతం రక్షించారని గుర్తుచేశారు. రామయ్య కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సీఎం రేవంత్.. దిగ్భ్రాంతి**

హైదరాబాద్ :
పద్మశ్రీ అవార్డు గ్రహీత, పర్యావరణ ప్రియుడు వనజీవి రామయ్య అకస్మాత్తు మరణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో సీఎం రేవంత్ రెడ్డి వనజీవి రామయ్య మృతికి సంతాపం తెలిపారు.

**తీరని లోటు : డిప్యూటీ సీఎం భట్టి..**


తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.. వనజీవి దరిపల్లి రామయ్య మృతిపట్ల శోకం వ్యక్తం చేశారు. కోటికి పైగా మొక్కలు నాటి, ఇంటిపేరు వనజీవిగా మార్చుకొని, పద్మశ్రీ పురస్కారం అందుకున్న రామయ్య మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. రామయ్య జీవితం భవిష్యత తరాలకు స్ఫూర్తి అని అన్నారు.

**హరీష్ రావు, కేటీఆర్...**

బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్‌లు కూడా రామయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. వృక్షో రక్షతి రక్షితః అనే సిద్ధాంతాన్ని ఆచరిస్తూ కోట్లాది మొక్కలు నాటి, ఆరోగ్యం క్షీణించినా పర్యావరణ ఉద్యమాన్ని కొనసాగించిన ఆయన జీవితాన్ని నేతలు కొనియాడారు.

**పీసీసీ చీఫ్ మహేష్ ..**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా రామయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీవితాన్ని మొక్కలకు అంకితం చేసిన పర్యావరణ ప్రేమికుడని రామయ్యను కొనియాడారు.



## వనజీవి రామయ్య కన్నుమూత

ఖమ్మం : పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, వనజీవి రామయ్య కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. చెట్లను పెంచండి అంటూ చిన్నతనం నుంచే ప్రచారం చేస్తూ చెట్లు నాటుతూ సేవ చేసిన దరిపల్లి రామయ్య అలియాస్ వనజీవి రామయ్య. వనజీవి రామయ్య మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ప్రకృతి ప్రేమికులు, రాజకీయ ప్రముఖులు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నారు.